క్లుప్తంగా

రేపు తర్తూరు టోల్‌గేటు వేలం

జూపాడుబంగ్లా: తర్తూరు టోల్‌గేటు వేలం పాటలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాజా తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వేలం పాటల్లో పాల్గొనదలచిన వారు రూ.15 వేల ధరావత్తు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. టోల్‌గేటు నిర్వహణను దక్కించుకున్న వారు పంచాయతీ నిర్ణయించిన మొత్తాన్ని మాత్రమే వసూలు చేయాలన్నారు.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సరం క్యాలెండ్‌ను సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, మునిదాసు, సంజీవ, భాస్కర్, పార్థసారధి, చక్రపాణి, కుమారాచారి, నాగ మద్దిలేటి, శేషన్న, వరలక్ష్మి, కృష్ణ, రాణమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి



భక్తులకు మందులు అందజేస్తున్న డాక్టర్లు సభా, గంగాధర్

జూపాడుబంగ్లా: ఎండతీవ్రత పట్ల పాదయాత్రికులు అప్రమత్తంగా ఉండాలని జూపాడుబంగ్లా ప్రాథమిక వైద్యులు సభా, గంగాధర్ సూచించారు. సోమవారం పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్న కన్నడభక్తులకు వైద్యశిబిరం న్విహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎండ తీవ్రతకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి డాక్టర్లు వివరించారు. అనంతరం భక్తులకు వైద్యచికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు, ల్యాబ్ అసిస్టెంటు చెంచన్న, ఆరోగ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందికొట్కూరు: పొలాలకు వెళ్లే రహదారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మిడుతూరు మండల పరిధిలోని మాసాపేట పొలిమేరలో తలెత్తిన రహదారి సమస్యను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలాలకు వెళ్లే రహదారి విషయం జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తానన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్నత స్థాయి అధికారుల నిర్ణయం వచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఓబులేసు ఉన్నారు.

పథకాలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పగిడ్యాల: ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శివరాముడుకు వినతిప్రతం అందజేశారు. అనంతరం పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకురాళ్లు గంధం ఉసేనమ్మ, ఈశ్వరమ్మ, బీరమ్మ పాల్గొన్నారు.

2న బండలాగుడు పోటీలు

గోస్పాడు: గుమ్మిత మల్లికార్జున, వీరభద్ర స్వామి ఉత్సవాల సందర్భంగా దీబగుంట్లలో పామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం ఏప్రిల్ 2న ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి సోమవారం తెలిపారు.

పేదల బతుకుల్లో 'మందు' పాతర

- ఊరూరా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- ఉపాధిగా మార్చుకున్న కూటమి నాయకులు

ఊరూరా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. మరోవైపు నాటు సారా ఏరులై పారుతోంది. రోజంతా పని చేసి అలసిపోయిన పేదలు సులభంగా లభ్యమయ్యే మద్యం తాగి ఒళ్లును గుల్ల చేసుకుంటున్నారు. కూటమి నాయకులు మాత్రం బెల్ట్‌షాపులనే ఉపాధిగా మార్చుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటుసారా తయారీ, బెల్ట్ షాపులపై పోలీసులు, సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి పరిస్థితులు కనుమరుగయ్యాయి.



నందికొట్కూరులో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న దృశ్యం

నందికొట్కూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు తెరిచి విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను ప్రోత్సహించేందుకు కూటమి సర్కార్ సర్వం సిద్ధం చేసింది. రాష్ట్రాన్ని మైకంలోకి నెట్టి పేదల బతుకుల్లో మందు పాతర పెట్టే పనిలో కూటమి ప్రభుత్వం తలమునకలైంది. దశలవారీగా మద్యం షాపులు తగ్గించి, ధరలు షాక్ కొట్టేలా చేస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలను అధికారంలోకి వచ్చాక ఆచరించి చూపగా.. కూటమి నేతలు మాత్రం అదే మద్యాన్ని అడ్డుపెట్టుకుని ఆదాయం పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు బార్లా తెరిచినా, నాటు సారా కాచినా అడిగేవాడు లేరన్న ధైర్యంతో, అధికార మదంతో రెచ్చిపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశ్చిమ ప్రకాశంలో పోలీసు, సెబ్ అధికారులు నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపగా కూటమి ప్రభుత్వం రాగానే అధికారులపై ఒత్తిడి తేవడంతో మళ్లీ అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, బెల్ట్‌షాపులు కేంద్రాలుగా వెలిశాయి.

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నందికొట్కూరు, కొత్తపల్లి, పగిడ్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లోని కోళ్లబావాపురం, ఎర్రమఠం, శివపురం, గువ్వలకుంట్ల, శ్రీశైలం నియోజకవర్గంలోని కొట్టాల చెరువు, ఇందిరేశ్వరం, వెంకటాపురం, బైర్లూటీటి, సిద్ధాపురం, వెలుగోడు, నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్ తదితర ప్రాంతాల్లో ఒక వైపు బెల్ట్‌షాపులు, మరో వైపు నాటుసారా బట్టీలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మద్యం దుకాణాలను తెలుగుదేశం పార్టీ నేతలు ఆధీనంలోకి తీసుకుని ప్రతి గ్రామానికి రెండు లేదా మూడు బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లోని మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసి బెల్ట్‌షాపుల్లో విక్రయిస్తున్నారు. క్వాటర్ బాటిల్‌పై ఉన్న ధర కంటే అదనంగా రూ.50 నుంచి రూ.100కు పెంచి విక్రయిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఐదారుగురు కలిసి తెలంగాణ మద్యం నుంచి మద్యం తెచ్చి నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం, నంద్యాల నియోజకవర్గాలకు ఆటోలు, కార్లు, బైక్‌లపై తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే తరచూ సోదాలు నిర్వహిస్తున్నాం. అనుమతులు లేకుండా వైన్ షాపులు నిర్వహించడం నేరం. నిర్వాహకులకు అవగాహన కల్పిస్తాం. అయినా వినకపోతే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.
– సీఐ రామాంజనేయులు నాయక్, ఎక్సైజ్, నందికొట్కూరు



పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోటలో కిరాణం అంగడిలో మద్యం విక్రయిస్తున్న దృశ్యం

వీడియోకాన్ఫరెన్స్ సెట్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: ఈనెల 4న 'సాక్షి' దినపత్రికలో 'మరమ్మతులకు గురైన వీడియోకాన్ఫరెన్స్ సెట్' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ సెట్‌కు మరమ్మతులు చేయించి, సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ పలువురి నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి పంపారు.

పీజే ఆర్ఎస్‌కు 6 వినతులు

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రైతుల నుంచి 6 వినతుల వచ్చాయని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. భూముల సర్వే కోసం నలుగురు రైతులు, ఆన్‌లైన్ సమస్య పరిష్కరించాలంటూ ఇద్దరు రైతులు వినతలు అందజేశారని, పరిశీలించి పరిష్కారం చూపుతామని ఆమె తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

జూపాడుబంగ్లా: అనారోగ్యానికి గురై శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మండ్లెం గ్రామానికి చెందిన కృష్ణవేణమ్మకు రూ.1,62,000, వెంకటేశ్వర్లుకు రూ.30 వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయన సోమవారం బాధితులకు అందజేశారు.

మహానందీశుడి దంపతులకు పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో సోమవారం రాత్రి పల్లకోత్సవం కనులపండువగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు స్థానిక అలంకార మండపంలో ముందుగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీసేవను వైభవంగా చేశారు. పలు ప్రాంతాల భక్తులు పల్లకోత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పల్లకీని మోశారు. ధ్వజస్తంభం వద్ద హారతి అనంతరం తిరిగి స్వామి, అమ్మవారి మూర్తులను అలంకార మండపంలోకి చేర్చారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: వచ్చే ఐదేళ్లలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా జీరో పావర్టీ–పీ4 పాలసీ అమలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీటీసీ పుల్యాల దివ్య సూచించారు. సోమవారం స్థానిక సచివాలయం–1లో సర్పంచ్ పెరుమాళ్ల భాస్కర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పగిడ్యాల 1, 2 సచివాలయాల పరిధిలో ఉన్న 122 కుటుంబాల వివరాల సర్వేను లోపభూయిష్టంగా కాకుండా పకడ్బందీగా నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులకు సూచించారు. సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని చేతిపంపులు, తాగునీటి బోర్ మోటార్లకు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సత్యమ్మ ఉన్నారు.

అప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ఆత్మకూరు: అప్కాస్ రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పెద్ద నాగరాజు కోరారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. అప్కాస్‌లో లక్షలాది మంది కార్మికులు ఉన్నారన్నారు. దాన్ని రద్దు చేసి దళారీ వ్యవస్థకు అప్పగిస్తే కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అప్కాస్‌ను యథావిధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జయన్న, వినోద్, సురేష్, రాజేంద్ర, నాగన్న, మరియమ్మ, మేరమ్మ, కుమారి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



ఆకుకూరల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించే ఆహార ధాన్యాలు ఆరోగ్యానికి మంచివని తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏఓ విజయ్‌జ్యోతికుమార్ తెలిపారు. సేంద్రియ పద్ధతులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలను సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, మందులు పిచికారీ చేస్తుండటం వల్ల ఆహార పదార్థాలు కలుషితమై రోగాలు వ్యాపిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ ఆహార పదార్థాలు పండించుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నందికొట్కూరు: 10 బొల్లవరం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం 10 బొల్లవరం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నెల రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కరించకపోతే కాలనీ వాసులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ షాజిదాబీ, మహానంది, నాగేష్, దానమ్మ, లక్ష్మీదేవి, శేషమ్మ, చిట్టెమ్మ, రత్నమ్మ, వెంకటమ్మ, సురేంద్రకుమార్, జడ్సన్ పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై అవగాహన

నందికొట్కూరు: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక హాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటి శుభ్రతపై ప్రభుత్వ వైద్యశాల దంత వైద్యులు మురళీధర్ అవగాహన కల్పించారు. రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆహారం తిన్న తర్వాత నోటిలో నీరు పోసుకుని బాగా పుక్కిలించాలన్నారు. చాక్లెట్, బిస్కెట్లు, బేకరి పదార్థాలు, స్వీట్లు తినకపోవడం మంచిదన్నారు. ఆరు నెలలకోసారి దంత పరీక్షలు చేయించుకోవాలని, మూడు నెలలకోసారి టూత్ బ్రష్ మార్చుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.హర్షిత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రిల్ మొదటి వారంలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని ఆల్ఫా కాలేజీ సమీపంలోని హైవే పక్కన గుర్తుతెలియని మృతదేహం సోమవారం లభ్యమైనట్లు రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ పొలంలో చెత్తను కాల్చేందుకు నిప్పు పెట్టడంతో హైవే రోడ్డు పక్కన ఉన్న చెత్త కూడా తగలబడింది. దీంతో చెత్తలో ఉన్న గుర్తుతెలియని మృతదేహం కాలిపోయి బయట పడింది. మృతుడు సుమారు 10 రోజుల క్రితం మృతిచెందినట్లుగా ఉందని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆటపాటలతో బోధన చేయాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఆటపాటల ద్వారా చిన్నారులకు బోధన చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం దుద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్‌బీ.. పడాయిబీ కార్యక్రమంలో భాగగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో జరిగే మార్పులు, ప్రవర్తన, వికాసం, గమనించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరమ్మ, ఆశీర్వాదమ్మ పాల్గొన్నారు.

– పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సూపర్‌వైజర్లు లలిత ప్రభావతి, వెంకటేశ్వరమ్మ పాల్గొని పాములపాడు, వేంపెంట సెక్టార్లలోని అంగనర్‌వాడీ టీచర్లకు పలు అంశాలపై వివరించారు. శిక్షణ తరగతులను సీడీపీఓ కోటేశ్వరమ్మ తనిఖీ చేశారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



పాములుపాడులో విద్యార్థులకు నిమ్మరసం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం గణిత పరీక్షకు కొత్తపల్లి పరీక్ష కేంద్రంలో 188 మందికి గానూ 183 మంది విద్యార్థులు హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ వెంకటరమణ ఆచారి తెలిపారు. గోకవరం పరీక్షా కేంద్రంలో 97 మందికి గాను 90 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ వెంకటశివుడు తెలిపారు. కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ రామాంజనేయులు, విద్యాశాఖ అధికారి–2 ఇనాయతుల్లా తనిఖీ చేశారు.

- పాములపాడు: మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జెడ్పీహెచ్, ఏపీ మోడల్ స్కూళ్ల వద్ద పదో తరగతి పరీక్ష రాసి వచ్చిన విద్యార్థులకు నిమ్మరసం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిమ్మరసం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చంద్రుడు, రామచంద్ర రాయుడు, చిన్నపుల్లయ్య, రామ్మోహన్, వెంకటస్వామి, గణేష్, మహేంద్ర, నాగ గణేష్, శివ చరణ్ పాల్గొన్నారు.
- మహానంది: మహానంది మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 19 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బండి ఆత్మకూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు టి.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టిన కూటమి నాయకులు మాట మార్చడం సిగ్గుచేటన్నారు. గృహ నిర్మాణం కోసం ప్రకటించిన రూ.2.50 లక్షలు ఏమాత్రం సరిపోదన్నారు. ఇప్పటికైనా సూపర్ 6 హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి రత్నమయ్య, సీనియర్ నాయకులు రామచంద్రుడు, మల్లికార్జున, బాలుడు, సుంకన్న పాల్గొన్నారు.

తర్తూరు జాతరను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరను విజయవంతం చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అధికారులకు సూచించారు. తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి ఆలయంలో సోమవారం సర్పంచ్ పీఎం నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. 340సీ క్రాస్‌రోడ్డు వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి ట్రాఫిక్ నియంత్రించాలని సీఐ సుబ్రహ్మణ్యంకు సూచించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా 12 గంటలపాటు త్రీఫేస్ కరెంట్ సరఫరా చేయించాలని డీఈఈ శ్రీనివాసరెడ్డికి సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మద్యం, నాటుసారా విక్రయాలను అరికట్టాలని ఎక్సైజ్ సీఐ రామాంజనేయనాయక్‌కు సూచించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్‌నోటీసులిచ్చి సమాధానం తీసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీపీ సువర్ణమ్మ, కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఈఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

- ఆర్డీఓ నాగజ్యోతి



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని ఆర్డీఓ నాగజ్యోతి అన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రగతి హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయ పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికీ సకాలంలో గుర్తించి మందులు, పోషకాహారం తీసుకుంటే నయమవుతున్నారు. అనంతరం క్షయవ్యాధి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు జమలుద్దీన్, వైద్య సిబ్బంది గుర్రప్ప, కరుణాకరమ్మ, ప్రగతి హైస్కూల్ హెచ్ఎం, కరస్పాండెంట్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కల్లూరి పెద్దమస్తానయ్య, ల్యాబ్ టెక్నీషియన్లు సుజాత, రమేష్ పాల్గొన్నారు.

- ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని బైర్లూటీ పీహెచ్‌సీ వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్ ట్రైబల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సోమేశ్వరి, స్టాఫ్ నర్స్ షఫీమున్నీసా, ట్రైబల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలి

కొత్తపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పని చేయలని వైద్యాధికారులు జబీర్, దీపా నాగవేణి, జమాలుద్దీన్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం కొత్తపల్లి, ఎర్రమఠం, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వరల్డ్ టీబీ డేను ఆత్మకూర్ యూనిట్ టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీబీ ఓడిపోతుంది – దేశం గెలుస్తుంది అంటూ వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎర్రమఠం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వాడితే నయం

మహానంది: వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అందించే మందులను క్రమం తప్పకుండా వాడితే టీబీ పూర్తిగా నయమవుతుందని తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి తెలిపారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ నివారణకు ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన మందులను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్షయవ్యాధి గాలి ద్వారా వ్యాప్తి

నందికొట్కూరు: క్షయవ్యాధి అంటువ్యాధి అని, గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందని డాక్టర్ తిరుపతి అన్నారు. సోమవారం మిడుతూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా రాబర్ట్ కాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ తిరుపతి మాట్లాడుతూ మూడు వారాలకు పైగా జ్వరం, దగ్గు ఉన్నట్లయితే గల్ల గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భరత్, శారద, స్టాఫ్ నర్సులు రత్న, రామతులసి, ముత్తు, ఫార్మసి శ్రీజ, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు సత్యనారాయణ, జబీన పాల్గొన్నారు.



రాబర్ట్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది